సాక్షి
వికారాబాద్
శనివారం ၊ 16 ၊ నవంబర్ ၊ 2024



ప్రారంభానికి సిద్ధం
కొడంగల్ మార్కెట్ యార్డులో నిర్మించిన బాహుబలి వంటశాల ప్రారంభానికి సిద్ధమైంది. 10లో▸



కర్ణాటక కూలీలే దిక్కు!
పత్తి రైతులను కూలీల సమస్య వెంటాడుతోంది. వరి, పత్తి పంటలు ఒకేసారి చేతికి రావడంతో సమస్య ఎదురవుతోంది. 10లో▸



కంకర రోడ్డుతో అవస్థలు
కుప్పగిరి స్టేజి నుంచి చంద్రకల్ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర వేసి వదిలేశారు. 11లో▸

న్యూస్‌రీల్

మత్స్య సంపదతో ఉపాధి
మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకయ్య



లక్నాపూర్ ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న వెంకయ్య తదితరులు

పరిగి: మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో చేపల పెంపకం చేపట్టిందని మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకయ్య తెలిపారు. శుక్రవారం లక్నాపూర్ ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 13 చెరువుల్లో 12లక్షల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో అన్ని చెరువుల్లో చేపలు వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు ఆలస్యం కావడంతో చేప పిల్లల పంపిణీలో జాప్యం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు ఆనేం ఆంజనేయులు, పరిగి సంఘం కార్యదర్శి దుర్గాప్రసాద్, సభ్యులు గోపాల్, ఆంజనేయులు, శంకర్, శివ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా
శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపూర్‌కు చెందిన ఉప్పరి నర్సింలు తల్లి రత్నమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు భీమ్‌రెడ్డి, హమీద్ మియా, ఉప్పరి శ్రీశైలం, రాజు, వెంకటప్ప, బల్వంత్‌రెడ్డి, బిర్కుట్ రఘు, బీదర్ రాజశేఖర్, అబ్దుల్ కవి, శ్రీనివాస్, శివానంద్ మడపతి తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్ సమీపంలోని పొలాల వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న సన్నరకం వడ్ల రాసులు

మిషన్ చెబితేనే.. బోనస్!




ప్రత్యేక యంత్రం నిర్ధారిస్తేనే సన్నరకం ధాన్యం సేకరణ

- కొనుగోలు కేంద్రాల్లో మిషన్ల కొరత
- రూ.500 ఆశతోనే సన్నాల సాగు
- షరతులు లేకుండా బోనస్ ఇవ్వాలని రైతుల డిమాండ్

దుద్యాల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొత్త సమస్య రైతులను వేధిస్తోంది. సన్న వడ్లను విక్రయించేందుకు ముందుగా ఒక ప్రత్యేక యంత్రం(క్యాలీ బర్)లో వేసి నిర్ధారించుకోవాలి. కానీ ఆ మిషన్‌లో అన్ని రకాల సన్న వడ్లకు అవకాశం లేకపోవడమే ఇందుకు కారణం. తాము పండించిన సన్నాల రకం ఆ యంత్రంలో లేకపోతే ఎలాగని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలు సన్న వడ్లకు రూ.500లు బోనస్ ప్రకటించడంతో దొడ్డు రకాల వరి సాగుకు స్వస్తి చెప్పి సన్నాలకు రైతులు మొగ్గు చూపారు. ప్రస్తుతం పంట కోసి ధాన్యాన్ని ఆరబెట్టె పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ సమయంలో ప్రభుత్వం సన్నరకం వడ్లను కొనుగోలు చేయాలంటే పలు రకాల షరతులు పెడుతోందని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. సన్న రకం వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే వ్యవసాయ అధికారులు క్యాలీబార్ అనే మిషన్ ద్వారా నిర్ధారించుకోవాలి. అనంతరం కొనుగోలుకు అవకాశం కల్పిస్తారని డీసీఎంఎస్, ఐకేపీ సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం దుద్యాల్ మండలంలో సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో పరిగి మండలం గడిసింగాపూర్‌లోని కేంద్రానికి రైతులు వెళుతున్నారు.

అధికంగా సన్న రకం సాగు

సన్న రకం వడ్లకు అందించే బోనస్‌పై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం గతంలో సన్న రకాల వడ్లకు బోనస్ ఇస్తామని ప్రకటించడంతో వరి సాగుపై మక్కువ చూపారు. మండలంలో దాదాపు 5 వేల ఎకరాలకు పైగా సన్నరకం వరి సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. క్వింటాలు దొడ్డు రకం వడ్లకు రూ.2,320 కాగా, సన్న రకానికి బోనస్ రూ.500లతో కలిపి రూ.2,820 ఇస్తుంది. మొత్తం డబ్బులు కూడా ఒకేసారి ధాన్యం అమ్మిన రైతులు ఖాతాలో పడవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే డబ్బులు వేరు వేరు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ అవుతాయని మార్కెటింగ్ అధికారులు తెలియజేస్తున్నారు.



సన్నరకం వడ్లను గుర్తించే క్యాలీబర్ మిషన్

నష్టాల్లో రైతులు

ఏ రకం అయినా సన్న వడ్లు అనగానే ధరలు అధికంగానే ఉంటాయి. దొడ్డు రకాల వడ్లకు గరిష్టంగా రూ.2,320 వరకు ఉండగా సన్న రకాల వడ్లకు మాత్రం క్వింటలుకు దాదాపు రూ.3,000 నుంచి రూ.3,500 వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. అధిక ధరకు తోడుగా ప్రభుత్వం అందించే బోనస్‌తో కలుపుకొని సన్న రకాల వడ్లకు ధరలు మోస్తారుగా ఉంటాయని భావించిన రైతులకు నిరాశనే మిగిలింది. గతేడాది మిల్లర్లు రూ.3 వేలకు క్వింటాలు చొప్పున సన్న వడ్లు కొనుగోలు చేశారన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం బోనస్ లేకుండా క్వింటాలుకు రూ.2,320 ప్రకటించడంతో ప్రైవేట్ వ్యాపారులు కూడా ధరలను పూర్తిగా తగ్గించారు. ప్రభుత్వం అందిస్తున్న ధరల కంటే దాదాపుగా రూ.300 రూపాయలు తగ్గించారు. ఇందేంటని రైతులు ప్రశ్నిస్తే ప్రభుత్వం ధరలు తగ్గించడంతో మార్కెట్‌లో సన్న వడ్లకు డిమాండ్ తగ్గిందని చెబుతున్నారు.

ధర పెంచాలి



నాకున్న మూడెకరాల్లో వరి సాగు చేశా. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో ఎక్కువ మంది వరి సాగుకు మొగ్గు చూపారు. అధిక ధరతో పాటు బోనస్ కూడా వస్తుందని ఎంతో ఆశ పడ్డారు. కానీ బోనస్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంది. ప్రైవేట్ వ్యాపారులు దొడ్డు రకం ధాన్యంతో సమానంగా కొంటామంటున్నారు. ప్రభుత్వం ధర పెంచి రైతులను ఆదుకోవాలి.
– ఈరప్ప, రైతు, హస్నాబాద్

నిర్ధారిస్తేనే కొనుగోళ్లు



సన్న రకం ధాన్యాన్ని వ్యవసాయ అధికారులు పరిశీలించాకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. వీటి నిర్ధారణకు ఒక ప్రత్యేక మిషన్(క్యాలీ బార్) అందుబాటులోకి తీసుకొస్తున్నారు. దీనిలో సన్న రకం ధాన్యాన్ని వేసి పరిశీలిస్తారు. ఆ మిషన్ ఓకే చేస్తేనే వడ్లు అమ్మేందుకు గ్రామాల్లో ఏఈఓలు అనుమతులు ఇస్తారు.
– తులసీ, ఏఈ, దుద్యాల్

గ్రూప్ –3కి ఏర్పాట్లు పూర్తి

- 31 కేంద్రాల్లో పరీక్షలు
- హాజరు కానున్న 10,196 మంది అభ్యర్థులు
- ఉదయం 9గంటల నుంచే సెంటర్లలోకి అనుమతి
- 9:30 గంటలు దాటితే నో ఎంట్రీ

వికారాబాద్: గ్రూప్ –3 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో మొదటి సారి గ్రూప్ –3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వికారాబాద్ మండలంలో 14, తాండూరులో 11, పరిగిలో 05, పూడూరు మండలంలో ఒకటి చొప్పున 31 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 10,196 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్ష కేంద్రాల్లో శానిటేషన్, సీసీ కెమెరాల ఏర్పాటు, వాష్ రూమ్‌లు, బెంచీలు, ఫ్యాన్లు, మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, విద్యుత్, మంచినీటి సౌకర్యం, వైద్య సేవలు వంటి ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నారు. ఇందుకోసం అవసరమైన పరికరాలు సమకూర్చుకున్నారు. ప్రతి సెంటర్‌లో పోలీసులు, హెల్త్, టెక్నికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. వికారాబాద్ రైల్వే స్టేషన్, బస్టాండ్, ఎన్టీఆర్ చౌరస్తాల నుంచి పరీక్ష కేంద్రాల కు ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. 17వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, తిరిగి 3నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 18వ తేదీ ఉదయం సెషన్‌లో మూడో పరీక్ష నిర్వహిస్తారు.

- పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు ఎగ్జామ్ ఆరంభం నుంచి పూర్తయ్యే వరకు వీడియో రికార్డు చేస్తారు.
- కేంద్రాల్లోకి అభ్యర్థులు చెప్పులతో మాత్రమే రావాలి. షూ ధరించేందుకు అనుమతి లేదు.
- హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ తీసుకెళ్లాలి.
- ప్రభుత్వ గుర్తింపు కార్డు(పాన్ కార్డు, ఓటరు కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు)ల్లో ఏదైన ఒకటి తీసుకెళ్లాలి.
- హాల్ టికెట్‌పై ఫొటో సరిగ్గా కనిపించకపోతే గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించి తీసుకురావాలి.
- కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు.
- ఓఎమ్ఆర్ షీట్‌పై వైట్‌నర్, చాక్ పౌడర్, ఎరేజర్, బ్లేడ్ లాంటివి వినియోగించడం చెల్లదు.
- పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులెవరూ హాల్ నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించరు.
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

పటిష్ట బందోబస్తు: ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లాలో గ్రూప్ –3 పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రాల సమీపంలో ప్రజలు గుమికూడదని, జిరాక్స్ సెంటర్, దుకాణాలను మూసి ఉంచాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇద్దరు సీఐలు, 11 మంది ఎస్ఐలు, 29మంది ఏఎస్ఐ, హెచ్‌సీలు, 76మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం



నవాబుపేట: ఎల్లకొండ శివాలయం వద్ద భక్తుల సందడి

నేత్రపర్వం అనంతుడి రథోత్సవం

- పద్మనాభస్వామి పెద్ద జాతరకు పోటెత్తిన భక్తజనం
- స్వామివారిని దర్శించుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

అనంతగిరి: అనంతగిరుల్లో వెలసిన అనంతపద్మనాభస్వామి ఆలయంలో కార్తీక మాస పెద్ద జాతర అంగరంగ వైభవంగా జరుగుతోంది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు రథోత్సవంపై విహరించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతుడి దర్శనం కోసం వేల మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం ఆలయ పుష్కరిణిలో భక్తులు స్నానమాచరించారు. తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సమేతంగా సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. స్వామివారిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణం జరిపించారు.. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కనుల పండువగా రథోత్సవం

కార్తీక మాస పెద్ద జాతరతో అతి ముఖ్యమైన ఘట్టం రథోత్సవం. ఈ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొని తరించారు. రథంపై కొలువుదీరిన స్వామివారిని కనులారా వీక్షించారు. అనంతగిరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సామూహిక భజనలు, సత్సంగ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

భక్తులతో కిటకిటలాడిన ఎల్లకొండ శివాలయం

నవాబుపేట: మండలంలోని ఎల్లకొండ గ్రామ శివాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ భరత్‌రెడ్డి తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరిజన గౌరవ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రధాని మోదీ సందేశాన్ని దృశ్యమాలిక ద్వారా అధికారులు, గిరిజనులు తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజనలకు మెరుగైన వసతుల కల్పించేందుకే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందన్నారు. తండాల్లో ఉపాధి అవకాశాల కోసం, తాగునీరు, విద్య, వైద్యం, ఇతర సౌకర్యాల కోసం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బాలికల నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి ఫణికుమారి, డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంలు, సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ సందేశాన్ని వింటున్న అధికారులు, గిరిజనులు

వెల్లివిరిసిన భక్తిభావం



జాతరలో కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు

- ధారూరు మెథడిస్టు జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు
- మార్మోగిన ఏసుక్రీస్తు నామస్మరణ
- ప్రార్థనలో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ధారూరు: ధారూరు మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు శుక్రవారం భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో జాతర ప్రాంగణం సందడిగా మారింది. హైదరాబాద్ – ముంబై, నాందేడ్ – బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, బీదర్ నుంచి ప్రత్యేక రైలు, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులు రావడంతో జాతర జనంతో కిక్కిరిసిపోయింది. జాతర కమిటీ కార్యదర్శి స్టీవెన్, రెవరెన్ మార్క్ డీఎస్ ఏసుక్రీస్తు శాంతి సందేశాన్ని వినిపించారు.

కాలినడకన వేల సంఖ్యలో భక్తులు

కర్ణాటక, తెలంగాణ జిల్లాల నుంచి వేల మంది భక్తులు కాలినడకన జాతరకు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఖాళీ స్థలాల్లో గుడారాలు వేసుకున్నారు. మూడు రోజుల పాటు ఇక్కడ ఉండేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రధాన శిలువ వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కానుకలు సమర్పించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. జాతర కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. దుకాణాల్లో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఎంవైఆర్ ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచిత అన్నదానం చేశారు.





క్రీడా జ్యోతి వెలిగించి ఖోఖో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

క్రీడాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- గౌతమి పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

యాలాల: క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలను స్థానిక గౌతమి పాఠశాలలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని పది జిల్లాలకు చెందిదన ఖోఖో క్రీడాకారులు టోర్నీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంరెడ్డి, ఎంఈఓ సుధాకర్ రెడ్డి, గౌతమి పాఠశాల కరెస్పాండెంట్ మహిపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ కొండారెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, రాములు, ఖోఖో టోర్నమెంట్ ఆర్గనైజర్ అనంతయ్య, ఏంఎసీ డైరెక్టర్ మేకల రాజు, నర్సింహులుగౌడ్, నాయకులు హన్మంతు, అక్బర్‌బాబా తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బిర్సాముండా జయంతి



బిర్సాముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

బషీరాబాద్‌: ఆదివాసీల ఆరాధ్య దైవం బిర్సా ముండా జయంతి సందర్భంగా బషీరాబాద్‌ మండలం కొత్లాపూర్‌ తండాలో శుక్రవారం ఆయన చిత్రపటానికి అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్‌ బీట్‌ అధికారి మల్లప్ప మాట్లాడుతూ.. బిర్సా ముండా ఆదివాసీ, గిరిజన సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేశారన్నారు. ఆయన జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సముచితమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి విశాల్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒకే ఏడాదిలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



అశ్విని

పరిగి: ప్రభుత్వ ఉద్యోగం కోసం శ్రమిస్తున్న నిరుద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారు అశ్విని. ఈ ఏడాది మూడు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసిన ఆమె పట్టుదల, ప్రణాళికతో చదివి మూడు ఉద్యోగాలు సాధించారు. మండల పరిధిలోని రంగంపల్లికి చెందిన రాంరెడ్డి, అనసూయ దంపతుల కూతురు అశ్విని ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో.. స్కూల్‌ అసిస్టెంట్‌ (మ్యాథ్స్‌) జిల్లా స్థాయి మొదటి ర్యాంకు, ఎస్టీటీలో 17వ ర్యాంకు సాధించి, రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అనంతరం తాండూరు నంబర్‌ వన్‌ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్‌ (ఎస్‌ఏ) ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరారు. ఇదిలా ఉండగా గురువారం ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్‌–4 ఫలితాల్లోనూ జూనియర్‌ అకౌంటెంట్‌గా ఎంపికయ్యారు. ఒకే ఏడాది మూడు ఉద్యోగాలు సాధించిన అశ్వినిని కుటుంబ సభ్యులు అభినందించారు.

చీకటిలో సంత.. గ్రామస్తుల చింత



చార్జింగ్‌ లైట్లతో కొనసాగుతున్న మార్కెట్‌

దుద్యాల్‌: మండల కేంద్రంలో సాగుతున్న సంత శుక్రవారం చీకటిమయంగా మారింది. దాదాపు 40 నిమిషాల పాటు విద్యుత్‌ తొలగించడంతో కూరగాయలు కొనేందుకు వచ్చిన గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు గంటల పాటు మాత్రమే ఈ సంత సాగుతుండగా విద్యుత్‌ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. సంతకు వచ్చిన గ్రామస్తులు తమ సెల్‌ ఫోన్‌ లైట్లతో కూరగాయలు కొనుగోళ్లు చేశారు. దీనిపై విద్యుత్‌ అధికారులను వివరణ కోరగా.. సాంకేతిక సమస్య తలెత్తడంతో విద్యుత్‌ సరఫరా నిలిపోయిందని తెలిపారు. అనంతరం పునరుద్ధరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



దశరథ్‌ (ఫైల్‌)

బంట్వారం: ఇంట్లో నుంచి వెళ్లిన ఓ వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బంట్వారానికి చెందిన చౌట దశరథ్‌(40) ఈ నెల 12న శ్రీశైలానికి వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి పోయి తిరిగి రాలేదు. కుమారుడు ప్రవీణ్‌ ఫిర్యాదు మేరకు శుక్రవారం మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9701502602, 9177714734 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

బాహుబలి వంటశాల ప్రారంభానికి సిద్ధం

- రోజూ 28వేల మంది విద్యార్థులకు అల్పాహారం
- నియోజకవర్గంలోని 312 పాఠశాలలకు సరఫరా
- సీఎం చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం



కొడంగల్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వంటశాల

కొడంగల్‌: పట్టణంలోని మార్కెట్‌ యార్డులో నిర్మించిన బాహుబలి వంటశాల ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. కొడంగల్‌ నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 28వేల మంది విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం (హెల్తీ న్యూట్రిషన్‌ బ్రేక్‌ ఫాస్ట్‌) సరఫరా చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

విరాళాలతో నిర్వహణ

ఈ పథకాన్ని అమలు చేయడానికి హరేరామ హరే కృష్ణ చారిటబుల్‌ ట్రస్టుకు బాధ్యతను అప్పగించారు. సీఎస్‌ఆర్‌(కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సబిలిటీ) నిధులతో నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ప్రధాన కంపెనీలు వారి ఆదాయం నుంచి కొంత మొత్తం ఈ పథకానికి కేటాయిస్తారు. మార్కెట్‌లో ఉన్న భారీ కంపెనీలు వారికి వచ్చిన లాభాల నుంచి సమాజానికి ఉపయోగపడే పనులకు కొంత మొత్తం వెచ్చిస్తుంటారు. వీటినే సీఎస్‌ఆర్‌ నిధులు అంటారు. ఇప్పటికే మొదటి విడతలో వయాట్రీస్‌ ఫార్మా కంపెనీ మొదటి విడతలో రూ.6.4 కోట్ల విరాళాన్ని ప్రకటించింది.

సెంట్రలైజ్‌ కిచెన్‌ షెడ్‌

కొడంగల్‌లో అన్ని వసతులతో కూడిన వంటశాలను (సెంట్రలైజ్‌ కిచెన్‌ షెడ్‌) సిద్ధం చేశారు. తెలంగాణలో పైలెట్‌ ప్రాజెక్టుగా ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్‌ను ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కార్పొరేట్‌ స్థాయి విద్యతో పాటు పౌష్టికాహారం అందించడానికి సీఎం కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంపై భారం కాకుండా రోజూ ఉదయం పూట విద్యార్థులకు న్యూట్రిషనల్‌ ఫుడ్‌ను అందించడానికి ఏర్పాట్లు చేశారు.

ముగిసిన రక్త మైసమ్మ ఉత్సవాలు

హాజరైన మండలి చీఫ్‌ విప్‌ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: మండల పరిధిలోని దౌలాపూర్‌ శివారులో రక్త మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. చివరి రోజు అమ్మవారిని శాసన మండలి చీఫ్‌ విప్‌ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డిలు వేర్వేరుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామ మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సొసైటీ వైస్‌ చైర్మన్‌ వడ్డే రాములు, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, వడ్డే లక్ష్మి, గ్రామస్తులు శ్రీనివాస్‌, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

అర్ధరాత్రి దొంగల బీభత్సం

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీ
- బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరణ



బీరువాను పగులగొట్టి చిందరవందరగా పడేసిన సామగ్రి

ధారూరు: అర్ధరాత్రి వేళ దుండగులు గ్రామంలో దూరి బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని లూటీ చేశారు. మండల పరిధిలోని నాగారంలో గురువారం అర్ధరాత్రి దొంగలు మూడు ఇళ్లు, ఓ దుకాణంలో చోరీ చేసి బంగారం, వెండి, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటనపై శుక్రవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. బాధితుల కథనం ప్రకారం.. రాత్రి వేళ గ్రామానికి చెందిన వడ్డె సంజయ్య ఇంటి తాళం పగులగొట్టి పెట్టెలో దాచిన రెండున్నర తులాల బంగారు వస్తువులు, రూ.50 వేల నగదు దోచుకెళ్లారు. సదరు పెట్టెను గ్రామ శివారులో కాలువ(పీతిరోని వాడుక) వద్ద పడేశారు. మరొకరు కావలి నర్సింహులు రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి యాలాల మండలంలోని దేవనూర్‌ గ్రామంలో ఉన్న బంధువుల వద్దకు కుటుంబంతో కలిసి వెళ్లాడు. ఆయన ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి దూరి రెండు బీరువాలను ధ్వంసం చేశారు. అందులో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు, 45 తులాల వెండి గొలుసు ఆభరణాలు, రూ.17 వేల నగదు అపహరించుకెళ్లారు. ఎరుకల లక్ష్మి దుకాణం వెనుక ఉన్న తలుపు విరగొట్టి లోపలికి వెళ్లి రూ.10 వేల నగదు తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో ఉంటున్న మరో కుటుంబం తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారు. ఈ విషయమై బాధితులు ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ తమ సిబ్బందితో గ్రామానికి వెళ్లి దొంగతనాలు జరిగిన ఇళ్ల వద్దకు క్లూస్‌ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. కాలువ వద్ద పడేసిన పెట్టెను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లపైనే సంత

- ఇబ్బందుల్లో కూరగాయల క్రయవిక్రయదారులు
- రాకపోకలకు అవస్థలు
- శాశ్వత స్థలాలు కేటాయించాలని అభ్యర్థన

దౌల్తాబాద్‌: మండలంలోని దౌల్తాబాద్‌, బాలంపేట, గోకఫసల్‌వాద్‌ గ్రామాల్లో వారాంతపు సంత నిర్వహణకు సొంత స్థలం లేక చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుండడంతో అటు వ్యాపారులు ఇటు వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని దౌల్తాబాద్‌ సంతకు యాంకి, గుముడాల, అల్లాపూర్‌, కౌడీడ్‌, నర్సాపూర్‌ గ్రామాలకు చెందిన వ్యాపారులు, బాలంపేట సంతకు అంతారం, సుల్తాన్‌పూర్‌, నాగసార్‌, గత్ప గ్రామాల రైతులు వారు పండించిన కూరగాయలను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేయడానికి వినియోగదారులు సైతం భారీగా వస్తుంటారు. సంత నిర్వహణకు స్థలం లేకపోవడంతో ప్రధాన రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. సంత రోజు గ్రామంలోకి వెళ్లే రోడ్డు రైతులు చిరువ్యాపారులు, స్థానికులతో కిటకిటలాడుతుంది. దీంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఉంటోంది. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని బాలంపేట, దౌల్తాబాద్‌, గోకఫసల్‌వాద్‌ వారాంతపు సంతలకు శాశ్వత స్థలం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.




బాలంపేటలో రోడ్డుపైనే మార్కెట్‌



బొంరాస్‌పేటలో భక్తుల సందడి



అనంతగిరి: అనంతుడి సేవలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



బొంరాస్‌పేట: దీపాలను వెలిగిస్తున్న మహిళ

దిశ కమిటీ సభ్యుడిగా జానకీరాం చౌహాన్‌



కుల్కచర్ల: దిశ కమిటీ సభ్యుడిగా కుల్కచర్ల మాజీ సర్పంచ్‌ జానకీరాం చౌహాన్‌ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ సీనియర్‌ నాయకులు తనపై నమ్మకంతో దిశ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగేలా, నాణ్యత ఉండేలా కృషి చేస్తానని తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో కార్పెంటర్‌ మృతి

శంకర్‌పల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్‌ గౌడ్‌, గ్రామస్తుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌ మండలం మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన శేఖర్‌ (40) కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. తండ్రి బాలరాజు 12 ఏళ్ల క్రితం ఇల్లు వదిలి వెళ్లగా.. తల్లి లక్ష్మి రెండేళ్ల క్రితం మరణించింది. అన్న ఆంజనేయులు మెదక్‌ జిల్లా నర్సాపూర్‌లో కార్పెంటర్‌ దుకాణం నిర్వహిస్తుండగా శేఖర్‌ అక్కడే పని చేసేవాడు. నాలుగు రోజుల క్రితం తల్లి సంవత్సరీకం ఉందని చెప్పి పటాన్‌చెరులో ఉండే అక్క కల్పన ఇంటికి వచ్చాడు. మూడు రోజుల క్రితం అక్కడ నుంచి శంకర్‌పల్లికి వచ్చి పట్టణ శివారులో శవమై తేలాడు. శుక్రవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మద్యం తాగి, బహిరంగ మలవిసర్జనకు వచ్చిన క్రమంలో ఫిట్స్‌ వచ్చి మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. క్లూస్‌ టీం, డాగ్‌ స్క్వాడ్‌తో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ఆ చట్టాలను రద్దు చేయాలి

కందుకూరు: నరేంద్రమోదీ పాలనలో రైతు, కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చి పొట్టగొట్టే ప్రయత్నం చేస్తున్నారని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి విమర్శించారు. రైతు, కార్మిక వ్యతిరేక నూతన చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక జిల్లా కమిటీల నాయకులు దుబ్బాక రాంచందర్‌, పెరుమాండ్ల అంజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని పాషా నరహరి భవన్‌లో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ.. నల్ల చట్టాలపై గత సంవత్సరం పెద్ద ఎత్తున లక్షలాది మంది రైతులు దేశ రాజధానిని చుట్టుముట్టి ఆందోళనలు చేశారన్నారు. ఆ సమయంలో గడ్డకట్టే చలిలో 750 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. తమ పోరాటంతో చివరకు మోదీ ప్రభుత్వం మెడలు వంచారన్నారు. అప్పట్లో తాత్కాలికంగా ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్లు పార్లమెంట్‌లో ప్రకటించి, మళ్లీ అమలుపరిచేలా ప్రయత్నం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్కరణల పేరుతో విద్యుత్‌ రంగాన్ని ప్రైవేటీకరించి అన్నదాతల నడ్డి విరిచే ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. 56 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్‌ కోడ్‌ల పేరుతో కార్మికులకు కనీసం సమ్మెలు, పోరాటాలు చేసే హక్కు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. సీఐటీయూ జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్‌ కవిత, జిల్లా నాయకుడు నర్సిరెడ్డి, వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.కుమార్‌, రైతు సంఘం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్‌, సీఐటీయూ మండల కన్వీనర్‌ బాల్‌రాజ్‌ పాల్గొన్నారు.

కర్ణాటక కూలీలే దిక్కు!

- పత్తి తీసేందుకు పక్క రాష్ట్రం కూలీలను ఆశ్రయిస్తున్న రైతులు
- గతేడాదితో పోలిస్తే పెరిగిన కూలిరేట్లు



కర్ణాటక నుంచి పెద్దేముల్‌కు వస్తున్న కూలీలు

పెద్దేముల్‌: పత్తి రైతులను కూలీల సమస్య వెంటాడుతోంది. వర్షాకాలం సాగు చేసిన వరి, పత్తి పంటలు ఒకేసారి చేతికి రావడంతో కొరత నెలకొంది. దీంతో సరిహద్దు మండలాల తెలంగాణ రైతులు పక్క రాష్ట్రమైన కర్ణాటక కూలీలను ఆశ్రయిస్తున్నారు. ఇరురాష్ట్రాల సరిహద్దు మండలాల పరిధిలోని వ్యవసాయ పొలాల్లో కర్ణాటక రైతులు పంటలు పెద్దగా సాగు చేయడం లేదు. ఈ క్రమంలో రెండేళ్లుగా అక్కడి కూలీలు పనులు చేసేందుకు పెద్ద సంఖ్యలో తెలంగాణ గ్రామాలకు వస్తున్నారు. కర్ణాటకలోని షాదీపూర్‌, జిలోజితండాతో పాటు పలు తండాల నుంచి నిత్యం ఆటోల్లో వికారాబాద్‌ జిల్లా పెద్దేముల్‌, ధారూరు, బంట్వారం మండలాలకు వచ్చి పత్తి తీస్తున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 6 గంటల వరకు పత్తి ఏరుతున్నారు. వీరికి రోజుకు రూ.500 నుంచి రూ.600 గిట్టుబాటవుతోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి పత్తి సాగు విస్తీర్ణం పెరిగినా, పక్క రాష్ట్రం నుంచి వస్తున్న కూలీలతో కొంత వెసులుబాటు కలిగిందని చెబుతున్నారు. గతేడాది కిలో పత్తి తీసేందుకు రూ.10 చెల్లించగా ప్రస్తుతం రూ.12 నుంచి రూ.13 చెల్లిస్తున్నామని స్థానిక రైతులు చెబుతున్నారు. కూలీల రవాణాకు సంబంధించి ఖర్చులు సైతం తామే భరిస్తున్నామని పేర్కొంటున్నారు. కర్ణాటక రాష్ట్రంలో పత్తి సాగు ఆలస్యంగా జరిగిందని, దీనికి తోడు సాగు విస్తీర్ణం కూడా తగ్గడంతో పత్తి తీసేందుకు తెలంగాణ గ్రామాలకు వస్తున్నామని కర్ణాటక కూలీలు చెబుతున్నారు.

తల్లిని చంపిన కొడుకు

మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతో..

యాలాల: మద్యానికి బానిసైన కొడుకు పింఛను డబ్బుల కోసం తల్లిని హత్యచేశాడు. ఈ ఘటన మండలంలోని జక్కేపల్లిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. తాండూరు రూరల్‌ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లె చంద్రమ్మ(80) కొడుకు వెంకటయ్య ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వాలంటూ తరచూ తల్లిని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి తన వద్ద ఉన్న పెన్షన్‌ డబ్బులు ఇవ్వాలని తల్లితో గొడవపడ్డాడు. లేదంటే బంగారం ఇవ్వమని వాదించాడు. ఇందుకు వృద్ధురాలు నిరాకరించడంతో ఇంట్లోని రోకలితో ఛాతి, కాళ్లపై కొట్టాడు. దెబ్బలు తాళలేక చంద్రమ్మ అదే రోజు రాత్రి మృతి చెందింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం ఉదయాన్నే ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. తాండూరు డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహానికి తాండూరులోని జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉందని ఎస్‌ఐ శంకర్‌ తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



పెద్దేముల్‌: ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

- పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్‌ విజయలక్ష్మి
- చెంగోల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

తాండూరు రూరల్‌: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మండలంలోని చెంగోల్‌లో డీసీఎంఎస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తాలు లేకుండా బాగా ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలను తీసుకురావాలని కోరారు. వడ్లు క్వింటాలు ఏ గ్రేడ్‌ రకానికి రూ.2,320, బీ గ్రేడ్‌కు రూ.2,300 ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. కేంద్రాలను గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైస్‌ మిల్లర్లతో కొనుగోలు కేంద్రాలు ఆలస్యమైందన్నారు. వెంటనే విక్రయ ప్రక్రియ ప్రారంభిస్తున్నామని తెలిపారు. దళారులకు అమ్ముకొని రైతులు మోసపోవద్దని సూచించారు. ధాన్యం సేకరించేందుకు సరిపడా సంచులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మంబాపూర్‌ కేంద్రంలో తనిఖీ

పెద్దేముల్‌: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు రాకుండా చుడాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మండలంలోని మంబాపూర్‌ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. 17శాతం తేమ ఉన్న రైతులకు సంబంధించిన ధాన్యాన్ని మాత్రమే తూకాలు చేయాలన్నారు. కేంద్రాలకు వచ్చే రైతులు, సంబంధిత అధికారులతో మాట్లాడి తూకాలు సక్రమంగా చేసుకోవాలన్నారు. ఏమైన అవకతవకలు జరిగితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.